

పట్టణంలో స్వాగత ఫ్లెక్సీలు



ఫిబ్రవరి 16 నుంచి 25 వరకు

అంతర్వేది కళ్యాణోత్సవాలు

▸▸ పక్కా ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ హిమాన్ష్ శుక్లా

అమలాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్ష్ శుక్లా ఆదేశించారు. ఫిబ్రవరి 16 నుంచి 25వ తేదీ వరకు జరిగే కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఉత్సవ కమిటీ సభ్యులతో ముందస్తు ఏర్పాట్లపై చర్చించారు. ఫిబ్రవరి 19వ తేదీ అర్ధరాత్రి 12.29 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 20వ తేదీ మధ్యాహ్నం



రథోత్సవం, 24న చక్రస్నానం, 25న తెప్పోత్సవం వైభవంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. డార్మెటరీలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖల అధికారులు ఉత్సవాల నిర్వహణకు చక్కటి ప్రణాళికకు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉత్సవాల సమయంలో మద్యం షాపులు, మాంసం దుకాణాలను పూర్తిగా మూసివేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు తీసుకోవలసిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, డీపీవో వి.కృష్ణకుమారి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సత్యనారాయణ, ఉప కమిషనర్లు విజయరాజు, కేఎస్వీడీవీ ప్రసాద్, డీఈవో ఎం.కమలకుమారి, ఆర్డీసీ అధికారులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా

చర్యలు తీసుకోవాలి

▸▸ జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జేసీ నుపూర్‌అజయ్

అమలాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రబీ సాగుకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ప్రాధాన్యతాక్రమంలో ఇబ్బందులను అధిగమించే ప్రయత్నాలు ముమ్మరం చేయాలని, వ్యవసాయ, జలవనరులు, డ్రైనేజీ విభాగాల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జేసీ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. గత డిసెంబరులో మండలి సభ్యులు తీర్మానించిన అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు వివరించారు. డ్రైనేజీల్లో పూడిక తొలగింపు పనులు ఆ శాఖ అధికారులు చేపట్టకపోవడం వల్ల రైతులు మిచౌంగ్ తుఫాను కారణంగా తీవ్రంగా



నష్టపోయారని కమిటీ సభ్యులు వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావిచిన అనంతరం జేసీ ఆయా సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారు లకు దిశానిర్దేశం చేశారు. చేసిన ప్రతిపాదనలు, పనుల మంజూరు తదితర అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ అనుసంధానంతో కాల్వల్లో పూడికతీతకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. సాగునీటి వినియోగాన్ని గరిష్ఠతరం చేసే విధంగా షట్టర్లు, గేట్ల లీకేజీలను అరికట్టాలని ఆమె ఆదేశించారు. రబీలో సాగునీటి ఎద్దడిని అధిగ మించేందుకు డ్రైనేజీల్లో యుద్ధప్రాతిపదికన క్రాస్‌బండ్లు వేయడంతో పాటు ఫిబ్రవరి 5 నుంచి వారాబందీ విధానంలో సాగునీరు విడుదల చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1,02,701 ఎకరాల విస్తీర్ణంలో రబీ సాగు చేపట్టారని, ఎరువులు, పురుగు మందులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. రాయితీపై యాంత్రీకరణ సామగ్రి సకాలంలో సరఫరా చేయాలన్నారు. పంట కాలం తక్కువగా ఉన్న వరి వంగడాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని సూచించారు. రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు మాట్లాడుతూ నాబార్డు సాఫ్ట్‌వేర్‌లో వ్యవసాయ సదుపాయాల ఫండ్ యాప్‌లో కోనసీమ జిల్లా పేరు సూచించట్లేదన్నారు. తూర్పు గోదావరి జిల్లాగానే ఉందని, దాన్ని మార్పు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ధాన్యం సేకరణలో పాల్గొన్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మోటూరి సాయి, రమేష్, వ్యవసాయ అధికారులు కాకి నాగేశ్వరరావు, వెంకటరామారావు, ఎల్‌డీఎం కె.శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మండపేట ముస్తాబు

▸▸ మండపేట-ఆలమూరు రోడ్డులో నేటి మధ్యాహ్నం 'రా కదలిరా' పేరిట భారీ బహిరంగ సభ

▸▸ లక్ష మంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మండపేట, జనవరి 19:

మండపేట పసుపుమయమైంది. నందమూరి తారకరామారావు టీడీపీ స్థాపించిన సమయంలో ఇచ్చిన 'తెలుగుదేశం పిలుస్తోంది... రా కదలిరా' పిలుపు స్ఫూర్తితో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టీడీపీకి కంచుకోట అయిన మండపేటలో శనివారం అమలాపురం లోక్‌సభ పరిధిలో బహిరంగ సభకు ఆ పార్టీ నేతలు భారీ సన్నాహాలు చేస్తున్నారు. మండపేట-ఆలమూరు రోడ్డులో సభా స్థలి వద్ద ఏర్పాట్లను మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జోన్-2 ఇన్‌చార్జి రవి, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన నేతలు వేగుళ్ల లీలాకృష్ణ, బండారు శ్రీనివాసరావు పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం జరిగే బహిరంగ సభ ఏర్పాట్లు, జనసమీకరణపై వారు చర్చించారు. లక్ష మందికి పైగా హాజరవుతారని ఇరు పార్టీల నేతలు అంచనా వేస్తున్నారు. ఇది ఎన్నికల శంఖారావం సభ కానుందని నిర్వాహకులు చెప్పారు.

కోనసీమ జిల్లా నుంచి వచ్చే వాహనాల పార్కింగ్‌కు మండపేట -ఆలమూరు రోడ్డులో నాలుగుచోట్ల, బైపాస్ రోడ్డులో ఒకచోట ప్రదేశాలను సిద్ధం చేశారు. అమలాపురం, రాజోలు, గన్నవరం, కొత్తపేట నుంచి వచ్చే వాహనాలను ఆలమూరు రోడ్డులో... ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట నుంచి వచ్చే వాహనాలను ఆలమూరు రోడ్డులో పెట్టుకోవాలి.


బహిరంగ సభ ప్రాంగణం

బహిరంగ సభా స్థలి ఏర్పాట్లను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సారధ్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ యువ నేత వల్లూరి సాయికుమార్‌బాబు పర్యవేక్షిస్తున్నారు.


బహిరంగ సభా స్థలిని పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

ఎన్టీఆర్ పిలుపు స్ఫూర్తితో 'రా... కదలిరా' పేరిట మాజీ సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న బహిరంగ సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. మండపేట సభలో ప్రభుత్వ వైఫల్యాలను చంద్రబాబు ఎండగడతారు. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు రక్షణ లేకుండాపోయింది. యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. చంద్రబాబు-పవన్ కల్యాణ్ సంయుక్త సారధ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి తీరుతాము. అవినీతి వైసీపీ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

నిమ్మకాయల చినరాజప్ప,
బండారు సత్యనారాయణమూర్తి
మాజీ మంత్రులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామచంద్రపురం డీఎస్పీ, టీడీపీ నేతలు

328 మందితో బందోబస్తు

మండపేటలో శనివారం జరిగే రా... కదలిరా బహిరంగ సభకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని రామచంద్రపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన టీడీపీ నేతలతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 23 మంది ఎస్ఐలు, 66 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 201 మంది కానిస్టేబుళ్లు, 30 మంది రోప్ పార్టీ సిబ్బంది కలుపుకుని... మొత్తం 328 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. డీఎస్పీ వెంట మండపేట పట్టణ, రూరల్ సీఐలు ఉన్నారు.

రా.. కదలిరా..!

నేడు మండపేటలో చంద్రబాబు భారీ బహిరంగ సభ

▸▸ లక్ష మంది జన సమీకరణే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఏర్పాట్లు ▸▸ టీడీపీలో చేరనున్న వైసీపీ నేతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రా.. కదిలిరా.. ప్రభంజనంలా తరలిరా.. అంటూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం పార్లమెంటు స్థాయిలో మండపేట కేంద్రంగా శనివారం నిర్వహించే 11వ భారీ బహిరంగ సభకు తెలుగుదేశం, జనసేన సమాయత్తమవుతున్నాయి. భారీఎత్తున జనాన్ని తరలించడానికి నియోజకవర్గాల్లో ఇరు పార్టీల కేడర్లు పోటీపడుతున్నాయి. ఈ సభను విజయవంతం చేయడం ద్వారా టీడీపీ ఎన్నికల నగారాను ఇక్కడి నుంచే మోగించనుంది. కోనసీమ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేల సంఖ్యలో జనసమీకరణ చేయనున్నారు. ఇందుకోసం టీడీపీ నియోజకవర్గానికో పరిశీలకుడిని నియమించింది. వారితోపాటు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, టీడీపీ టిక్కెట్లు ఆశిస్తున్నవారు జనసమీకరణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండపేట-ఆలమూరు రోడ్డులోని బాబుఅండ్‌బాబు కన్వెన్షన్ హాలు పక్కన గల సభాస్థలిలో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ప్రారంభం కానుంది. వేదికపై చంద్రబాబుతోపాటు సుమారు 72 మంది ఆశీనులయ్యేలా ఏర్పాట్లుచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ముగ్గురు పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జనసేన ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నేతలతోపాటు 18 విభాగాలకు చెందిన అనుబంధ సంస్థల అధ్యక్షులను వేదికపైకి ఆహ్వానించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహించనున్నారు. జన సమీకరణలో భాగంగా ప్రైవేటు వాహనాలు, కార్లతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల వారు మోటారు సైకిళ్లపై తరలివచ్చేందుకు వీలుగా టీడీపీ, జనసేన నేతలు కృషి చేస్తున్నారు. ఈ సభను పెద్దఎత్తున విజయవంతం చేసేందుకు టీడీపీ జిల్లా నాయకత్వంతోపాటు అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చంద్రబాబునాయుడు సమక్షంలో వైసీపీకి చెందిన కీలక నేతలు టీడీపీలో చేరనున్నారు. శెట్టిబలిజ యువనేత, అమలాపురం పట్టణానికి చెందిన వాసంశెట్టి సుభాష్ వేలాదిమంది అనుచరులతో అమలాపురం నుంచి భారీ ర్యాలీగా మండపేట వెళ్లి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరతారు. కాకినాడలో ప్రసిద్ధి చెందిన సత్య స్కాన్ సెంటర్ నిర్వాహకుడు కాదా వెంకటరమణ, మలికిపురం మండలం మోరికి చెందిన చింతా వీరభద్రరావులతోపాటు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు టీడీపీలో చేరతారని తెలిసింది.



బాబు సభ ఏర్పాట్లకు భూమిపూజ చేస్తున్న బండారు, వేగుళ్ల తదితరులు

పర్యటన సాగేదిలా..

చంద్రబాబు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు విలేజ్‌లోని డుంబ్రిగూడ నుంచి శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బయల్దేరి కోనసీమ జిల్లా మండపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బహిరంగ సభాస్థలికి 3.15 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల వరకు సభలో పాల్గొంటారు. అనంతరం సభాస్థలి నుంచి బయలుదేరి బైపాస్ రోడ్డులోని హెలిపాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి 5.05 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. విమానంలో బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వెళతారు.



మండపేటలోని చంద్రబాబునాయుడు బహిరంగ సభ జరిగే ప్రదేశంలో శుక్రవారం రాత్రి వేదిక ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం





మండపేటలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దసంఖ్యలో నిర్మించిన టిడ్కో గృహాలు.. అవే భవనాలకు వైసీపీ రంగులు మార్చి వదిలివేయడంతో అధ్వాన దుస్థితి

టీడీపీ హయాంలో నిర్మించిన

టిడ్కో ఇళ్లకు మోక్షమేదీ

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

మండపేట, జనవరి 19: మండపేట పట్టణంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు నేటివరకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో వైసీపీ ప్రభుత్వం అందజేయలేదు. ఫేజ్1లో నిర్మించిన 4,064 గృహాల్లో ఇప్పటివరకు కేవలం 2,700 మందికి మాత్రమే ఇళ్లను అందించారు. మరో 1300 మందికి ఫేజ్1లో ఇవ్వాల్సి ఉంది. ఐదేళ్లుగా లబ్ధిదారులు సొంతింటికోసం ఎదురుచూపులు చేస్తున్నారు. మరోపక్క ఫేజ్2లో నిర్మించిన 2 వేల గృహాలకు సంబంధించి పనులు పూర్తయినప్పటికీ మౌలిక వసతులు కల్పించకపోవడం, బ్యాంకు రుణాలు మంజూరుకాకపోవడం వంటి కారణాల వల్ల నేటికీ టిడ్కో గృహాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇప్పటికే ఆ గృహాల్లో ఉంటున్న వారికి మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క నిర్మాణం చేయకుండా కేవలం భవనాల రంగుల మార్చిన ప్రస్తుతం ప్రభుత్వం.. ఎప్పటికి మిగిలిన వాటిని వినియోగంలోకి తెలుస్తుందో చూడాలి.



గాడ్‌ను సత్కరిస్తున్న కాశీ వేద పండితులు



గాడ్ సమక్షంలో సత్కారం అందుకున్న గరికపాటి, సాహితీవేత్తలు

హైందవ సనాతన ధర్మవ్యాప్తికి గాడ్ కృషి అభినందనీయం

టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాయవరం, జనవరి 19: హైందవ సనాతన ధర్మవ్యాప్తికి వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేస్తున్న కృషి అభినందనీయమని టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి 88వ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రసార భారతీ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో వేణుగోపాల దీక్షితులు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, సాగరఘోష కవి గరికపాటి నరసింహారావు, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, యర్రప్రగడ రామకృష్ణ తదితరులు మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు పీఠాధిపతులు, మఠాధిపతులు చేస్తున్న సేవలను కొనియాడడంతోపాటు మనిషి ధర్మపథంలో ఎలా నడవాలనేది రాముడు మనకు చూపాడన్నారు. అయోధ్యలో సీతారాముల ప్రతిష్ఠ సందర్భంగా రాముడి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలన్నారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ప్రసంగం చేస్తూ ప్రతి మనిషి దైవారాధన చేయడం ద్వారానే మానసిక ప్రశాంతత లభించడంతోపాటు చింతలు తొలగుతాయన్నారు. విజయదుర్గా విశిష్ట సేవా పురస్కారాన్ని అనపర్తికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు తేతలి సత్యనారాయణరెడ్డి, మస్తానమ్మ దంపతులకు అందజేశారు. పీఠాధిపతి గాడ్‌కు తిరుమల, కాశీ, అన్నవరం దేవస్థానాల నుంచి తీసువచ్చిన ప్రసాదాన్ని అందజేసి వేదాశీస్సులు వేదపండితులు అందజేశారు. ప్రముఖ వస్త్రవ్యాపారి తుమ్మిడి రామ్‌కుమార్, జీఎస్ఎల్ అధినేత గన్ని భాస్కరరావు, వారణాశి శృంగేరి శంకరమఠం మేనేజర్ చల్లా అన్నపూర్ణప్రసాద్, వారణాశికి చెందిన ఆధ్యాత్మికవేత్త చల్లా జగన్నాథ శాస్త్రి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





పిఠాపురం మండలం భోగాపురంలో నాటిక పోటీల్లో ప్రదర్శించిన రాత నాటికలోని ఓ దృశ్యం.. నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భోగాపురంలో ముగిసిన జాతీయ నాటికల పోటీలు

పిఠాపురం, జనవరి 19: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. భోగాపురం కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా నాన్నా నేనొచ్చేస్తా(గుంటూరు) ఎంపికకాగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా రాత(వెలగలేరు), తృతీయ ప్రదర్శనగా అమృతహస్తం(గుంటూరు), ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా కొత్త తరం కొడుకు(కొండెవరం), ఉత్తమ రచనగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ఉత్తమ దర్శకుడిగా పి.శ్రీనివాసరావు, ఉత్తమ నటుడిగా ఎంవీ రాజర్షి, ఉత్తమ నటిగా అమృతవర్షిణి, ఉత్తమ ప్రతినాయకుడిగా వై.హరిబాబులు ఎంపికయ్యారు. వీరందరికీ కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు నగదు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా జలదంకి సుధాకర్, ఎండీ ఖాజావలీ, యం.చిన్నారావులు వ్యవహరించారు. ఇక నాటికల పోటీలు చివరి రోజున ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. ఏడు అడుగులు కలిసి వేసి జంటలో ఎవరయినా ఎనిమిదో అడుగు వేయాలని ప్రయత్నిస్తే ప్రాణాంతకమవుతుంది. ఆలుమగలు మధ్య చిన్న చిన్న అంతరాలు ఉన్నా అర్థం చేసుకోవడం ద్వారా వాటిని సరిచేసుకుంటే ఆ బంధం కడదాకా ఉంటుందనే సందేశాన్ని ఇస్తూ హైదరాబాదుకు చెందిన జయా ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించి ఎనిమిదో అడుగు నాటిక సాగింది. మాడభూషి దివాకరబాబు రచించిన ఈ నాటికకు డాక్టర్ శ్రీజ సాధినేని దర్శకత్వం వహించారు. తాను పొందాల్సినవి మంచిగా పొందుతూ తిరిగి ఇవ్వాల్సిన వాటి విషయంలో మనిషి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న తీరుని వివరిస్తూ ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన వెలగలేరు ఆర్ట్ థియేటర్స్ కళాకారులు ప్రదర్శించిన రాత నాటిక ఆసక్తికరంగా సాగింది. మనిషికి కష్టం కలిగితే నా రాతింతే అనుకోవడం, సుఖం వస్తే మాత్రం రాతను వదిలేస్తాడనే ఈ నాటికను పి. శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు.



అయోధ్య రాముల వారికి కల్యాణ కొబ్బరి బొండాలను అందిస్తున్న రామారెడ్డి దంపతులు

అయోధ్యకు మండపేట కొబ్బరి బొండాలు


మండపేట, జనవరి 19: అయోధ్యలో ఈనెల 22న జరిగే అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి సంబంధించి శ్రీరాములు వారికి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కేవీ రామారెడ్డి దంపతులు తయారుచేసిన కల్యాణ కొబ్బరి బొండాలను గురువారం అయోధ్యలో రామమందిర ట్రస్టు నిర్వాహకులకు అప్పగించామని రెడ్డి దంపతులు శుక్రవారం తెలిపారు. తాము భద్రాచలం రాముల వారి కల్యాణానికి బొండాలు అందిస్తున్నామని, ఇప్పుడు అయోధ్య రామమందిరానికి బొండాలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.



ట్వంటీ ఫస్ట్ సెంచరీ సంస్థతో ఎంవోయూ చేసుకుంటున్న నన్నయ అధికారులు

గ్రూప్-2 పరీక్షల శిక్షణకు నన్నయ ఎంవోయూ

దివాన్‌చెరువు, జనవరి19: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గ్రూపు-2 పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీకి నన్నయ వర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం పునరుద్ధరించామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఎంవోయూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు గ్రూప్-2 పోటీపరీక్షలకు సంబంధించి శిక్షణ అందించేందుకు ట్వంటీఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ముందుకు వచ్చిందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.హైమావతిని సంప్రదించాలని కోరారు. విద్యార్థులను ఎంపికచేసి శిక్షణా తరగతులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. తొలుత రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పీవీవీ కృష్ణప్రదీప్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. సొసైటీ సీఈవో కె.ధరణి, సీనియర్ సివిల్స్ మెంటార్ బి.అభినవ్‌శ్రీకాంత్, నన్నయ విశ్వవిద్యాలయం ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.హైమావతి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ జి.నాగమణి

నేటి నుంచి 24 వరకూ జాతీయ టెన్నిస్ పోటీలు

23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారుల రాక : ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్, జనవరి 19: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ టెన్నిస్ పోటీలు శనివారం ప్రారంభమై ఈనెల 24 వరకూ కొనసాగుతాయని పాఠశాల విద్య జోన్2 ఆర్జేడీ, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.నాగమణి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్జేడీ మాట్లాడుతూ అండర్-19 పాఠశాల క్రీడా సమాఖ్య పురుషుల టెన్నిస్‌పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు వెల్లడించారు. పోటీలకు 23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. పోటీల నిర్వహణ నిమిత్తం కాకినాడ డీఎస్ఏ, పాత ఎస్పీ కార్యాలయం వెనుక, డిమార్ట్ సమీపంలోని సింథటిక్ టెన్నిస్‌కోర్టులను ఫ్లడ్‌లైట్లతో సిద్ధంచేసినట్టు తెలిపారు. పోటీల నిర్వహణకు కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ ఇలాక్కియా ఆదేశాల మేరకు వివిధ కమిటీలను ఏర్పాటుచేశామన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు డీఎస్ఏలో పోటీలు ప్రారంభమవుతాయని పాఠశాల క్రీడాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. పోటీల నిర్వహణ నిమిత్తం రాష్ట్ర క్రీడాసమాఖ్య నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరుచేశామన్నారు. 46 మంది కోచ్‌లు, 100 మంది స్థానిక అఫీషియల్స్ పోటీల నిర్వహణలో పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో పాఠశాల క్రీడాసమాఖ్య కార్యనిర్వహణా కార్యదర్శి బీవీవీఎస్వీ ప్రసాద్, డీవైఈవోలు ఆర్వీ డేనియల్‌రాజు, డి.సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, పీడీలు రంగారావు, రవిరాజు, బంగార్రాజు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. ఏపీ జట్టుకు క్రీడాదుస్తులను ఆర్జేడీ అందజేశారు.

నమాజ్‌కని బయలుదేరి..

కానరాని లోకాలకు


కారు ఢీకొని చికెన్ వ్యాపారి మృతి



రామ్‌తుల్లా (ఫైల్)

కరప, జనవరి 19: ప్రతీరోజు మాదిరిగానే వ్యాపారం ముగించుకుని నమాజ్ చేసుకోవడానికి బయలుదేరిన ఒక వ్యక్తిని కారు ఢీకొనడంతో కానరాని లోకాలకు తరలిపోయాడు. కాకినాడ జిల్లా కరపలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన షేక్ రామ్‌తుల్లా(50) కొన్నేళ్ల కిందట కరప వచ్చి కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. స్థానిక స్వర్ణ థియేటర్ వద్ద ఇద్దరు కుమారులతో కలిసి చికెన్ షాపును నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వ్యాపారం ముగించుకుని పెనుగుదురు మసీదులో నమాజ్ చేసుకోవడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి రామ్‌తుల్లాను బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తన చికెన్‌షాపు సమీపంలోనే జరిగిన ఈ ప్రమాదంలో రామ్‌తుల్లా తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నవ్వుతూ, అందరితో కలుపుగోలుతనంగా ఉండే రామ్‌తుల్లా కళ్ల ముందే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో సహచర వ్యాపారులు షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేర్చినట్టు కరప ఎస్ఐ తుపాటి రామకృష్ణ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించామని, నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ చేపడతామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి



అడ్డతీగల, జనవరి19: అడ్డతీగల మండలం మళ్ళవరం మామిళ్ళ గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమవరం పంచాయతీకి చెందిన శరత్‌రెడ్డి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం శరత్‌రెడ్డి రాజమహేంద్రవరం నుంచి గురువారం రాత్రి తన స్వగ్రామం భీమవరం వెళుతుండగా మళ్ళవరం మామిళ్ల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో శరత్‌రెడ్డి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో సాంస్కృతికశాఖ సంయుక్త కార్యదర్శి పూజలు

అన్నవరం, జనవరి 19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి నందూరి ఉమస్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నేడు నవోదయా ప్రవేశ పరీక్ష

పెద్దాపురం, జనవరి 19: జవహర్ నవోదయా ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న ప్రవేశపరీక్షను నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని, 8506 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను రిజిస్ట్రేషన్ నంబర్ లేదా పుట్టినతేదీ ఆధారంగా నవోదయా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9441829056, 9441008830, 944756148, 9704248269 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సురేష్, చైర్మన్ శేషుమాధవ్

రైతు వంగడాలు, హక్కుల పరిరక్షణపై వర్క్‌షాపు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 19: రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రంలో శుక్రవారం రైతు వంగడాలు, హక్కుల పరిరక్షణ అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. దీనికి ఐసీఏఆర్-సీటీఆర్ఐ డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్మెంట్ యూనిట్ చైర్మన్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వ్యవసాయ కళాశాల పీజేటీఎస్ఏయూ హైదరాబాద్ ప్రొఫెసర్ జె.సురేష్ విచ్చేశారు. అలాగే మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భారతిలక్ష్మి, ఎన్‌జీఆర్‌యూ వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం హెడ్ సి.శ్యాంరాజ్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.మాధవరావు, ఐఐఎంఆర్ రీసెర్చ్ స్టేషన్ పెద్దాపురం హెడ్ మునిరత్నం, డాక్టర్ జి.రామనందం, సీనియర్ శాస్త్రవేత్త కె.రవీంద్రకుమార్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం డాక్టర్ పి.లలిత కామేశ్వరి, వేమగిరి ఐసీఏఆర్-డీఎఫ్ఆర్ శాస్త్రవేత్తలు, వివిధ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, సీటీఆర్ఐ విభాగాల అధిపతులు, రైతులు, రైతు ఉత్పత్తిదారులు హాజరయ్యారు. మొక్కల రక్షణ, రైతులు హక్కుల అథారిటీ వంగడాల ప్రాముఖ్యతను, నూతన రైతు వంగడాలు అంశాలపై డాక్టర్ కె.సరళ మాట్లాడారు. ఎం.శేషుమాధవ్ సంస్థ పరివర్తన గురించి ప్రస్తావించారు. జియోగ్రాఫికల్ ఇండికేషనల్(జి1) అనే అంశంపై చర్చించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై విజిలెన్స్ దాడులు.. కేసులు నమోదు

నమూనాలు లేబొరేటరీకి

రాజమహేంద్రవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు విక్రయించేవాళ్లు ప్రజారోగ్యం దృష్ట్యా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సురేశ్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం రాజానగరం మండలంలోని పలు రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లలో విస్తృతంగా ఆకస్మిక సోదాలు చేశారు. జగన్నాథపురం (జె.అగ్రహారం)లోని ఫుడ్ పిరమిడ్‌లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, స్టాంపింగ్‌లేని వేయింగ్ మిషన్, 44 టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లు, బిల్లుల్లో జీఎస్టీ నమోదు చేయకపోవడం గుర్తించామని ఎస్పీ తెలిపారు. జీఎస్ఎల్ సమీపంలోని హ్యాబిటేట్‌లో నిల్వ ఉన్న 21 సోయా సాస్ బాటిల్స్ గుర్తించామన్నారు. కేసు నమోదు చేయడంతోపాటు చికెన్ బిర్యానీ నమూనాలు సేకరించి ఫుడ్ లేబొరేటరీకి పంపించామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ 25శాతంలోపు ఉండాలని కానీ చాలా రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న నూనెలో పరిమితి మించుతోందన్నారు. నూనెను ఎక్కువసార్లు ఉపయోగించడం వల్ల హాని జరుగుతోందని, అది ప్రజారోగ్యానికి హానికరమన్నారు. రెస్టారెంట్లు, బార్లు, ఫుడ్‌సెంటర్లు, హోటళ్ల కిచెన్లు, పరిసరాలు కచ్చితంగా పరిశుభ్రంగా ఉండాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని కోరుతున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగవెంకట రాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, ఏవో భార్గవ మహేశ్, డీసీటీవో షబ్బీర్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ

అనపర్తి, జనవరి 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అనపర్తి మండలంలోని కుతుకులూరులో మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. కుతుకులూరులో కర్రి వెంకట రామారెడ్డి తన తల్లితో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 15వ తేదీన గ్రామంలో జరిగే ముగ్గుల పోటీలు తిలకించేందుకు తన తల్లి వెళ్లడంతో ఇంట్లో బీరువాలో ఉన్న మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్టు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలియజేశారు.

దళితులను మోసగించిన ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

మండపేట, జనవరి 19: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దళితులను మోసగించే ప్రయత్నం చేస్తుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు దూళి జయరాజు ఆరోపించారు. ఎన్నికలు రాబోతున్న వేళ 125అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి దళిత ఓట్ల కోసం చేసే ప్రయత్నాలను దళితులు తిప్పికొడతామన్నారు. దళిత నాయకులు పిట్టా రాజబాబు, బొత్స నరసింహమూర్తి, షేక్ నబి, గాలింకి నాగేశ్వరరావు, గండం యేసు, రాజు దాసరి మోసేరాజు, బొమ్మ గంగాధర్ పాల్గొన్నారు.

దళితులను మభ్యపెడుతున్న ప్రభుత్వం


మామిడికుదురు: మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు


కొత్తపేట: మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు, జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం దళితులను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆరోపించారు. మామిడికుదురులో జరిగిన టీడీపీ నాయకుల సమావేశంలో గొల్లపల్లి మాట్లాడారు. అంబేడ్కర్ భారీ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులను మభ్యపెట్టలేవు జగన్ అని ఎద్దేవా చేశారు. ఈనాలుగున్నరేళ్లలో దళితులపై అనేకదాడులు జరిగాయని, 188మంది దళితులను హత్య చేశారని ఆరోపించారు. రాజ్యాంగ పరంగా దళితులకు అమలు కావాల్సిన 27సంక్షేమ పథకాలను రద్దుచేసి ఏం మొహం పెట్టుకుని అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తావని ప్రశ్నించారు. మండపేటలో జరిగే చంద్రబాబు రా.. కదలిరా.. సభను విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు పొత్తూరి రామ రాజు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, సాగి పాపయ్యరాజు, వర్ధినీడి బాబ్జి, సాపే ఏకాదశి, కాట్రేనిపాడు నాగేంద్ర, వాసంశెట్టి వెంకట్రావు, పెచ్చెట్టి భాస్కరరావు, ఇంటి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితులను నమ్మించి మోసగించిన జగన్

అంబాజీపేట, జనవరి 19: కోడికత్తి శ్రీనుతో మొదలైన జగన్ డ్రామా డాక్టర్ సుధాకర్, దళితుడ్ని చంపి డోర్‌డెలివరీ, రావులపాలెంలో దళితులపై అక్రమ కేసులు, విదేశి విద్య పేరు మార్పు వంటి వాటితో దళితులను అన్ని విధాల సీఎం జగన్ మోసగించారని టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్, నియోజకవర్గ పరిశీలకులు, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరిలు అన్నారు. అంబాజీపేటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితుల పట్ల చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు విజయవాడలో 125అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ప్రారంభించాడన్నారు.వచ్చేఎన్నికల్లో దళితులు జగన్‌కు తగిన బుద్ధిచెప్పాలన్నారు. నియోజకవర్గ కో కన్వీనర్ నామన రాంబాబు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు చిన్నం బాల విజయరావు, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, అరిగెల బలరామమూర్తి, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించే యోగ్యత జగన్‌కు లేదు: బండారు

కొత్తపేట, జనవరి 19: ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించే యోగ్యత లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం వాడపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల ప్రాణాలు బలిగొన్న వారిని అక్కున చేర్చుకుని అంబేడ్కర్‌పై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారన్నారు. దళిత నాయకులు బూసి భాస్కరరావు, పల్లి ఏసు, సత్యాల శ్రీను, కాశి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వం


ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురం టౌన్, జనవరి 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు మోదీ ప్రభుత్వం కట్టబెడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్మిక, కర్షక, ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కౌలు రైతు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక న్యాయాన్ని తుంగలోకి తొక్కి కులం, మతం పేరుతో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు కారెం వెంకటేశ్వరరావు, కె.కృష్ణవేణి, గుదే దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘాల నాయకులు పి.అ మూల్య, కె.బేబీగంగారత్నం, ఇసుకపట్ల మంగాదేవి, తాడి శ్రీరామమూర్తి, పర్వతాలు, జి.దైవకృప, విజయ, రత్నకుమారి, తొమ్మండ్రు గోపి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మరణించిన ఓటర్లు 24,109 మంది

అమలాపురం టౌన్, జనవరి 19: జిల్లాలో మరణించిన ఓటర్లు 24,109మంది ఉన్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. శాశ్వతంగా వలస వెళ్లినవారు 11,344మంది ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నట్టు తెలిపారు. తొలుత రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో శుక్రవారం కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే విధంగా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలోని 1,644 పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు జిల్లావ్యాప్తంగా సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందిని నియమించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సమావేశంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, సెక్షన్ అధికారులు బాబ్జీ, పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా 52వేల మంది ఓటర్లు నమోదు..

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందని, ఈనెల22న తుది జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందిస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. తుది ప్రచురణ ముగిసిన తర్వాత కూడా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 52వేల మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారు. తుది జాబితాలో తప్పిదాలుంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. సమావేశంలో వడ్డి నాగేశ్వరరావు (కాంగ్రెస్), సంసాని బులినాని (వైసీపీ), దూరి రాజేష్ (బీజేపీ), కారెం వెంకటేశ్వరరావు (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

* అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ హరీష్‌మాధుర్
* సభ విజయవంతానికి సమావేశాలు
* నేడు మండపేటలో రా కదలిరా బహిరంగసభ

చంద్రబాబు సభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న హరీష్‌మాథుర్, చిత్రంలో బొడ్డు వెంకటరమణ చౌదరి

అంబాజీపేట, జనవరి 19: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు, ప్రజలతో మమైకమయ్యే విధంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఏర్పాటుచేసే రా కదలిరా సభను శనివారం మండపేటలో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ కోరారు. అంబాజీపేటలో వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద పార్టీ మండల అధ్యక్షుడు దంతులూరి శ్రీనురాజు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు మండపేటకు తరలిరావాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, మండల అబ్జర్వర్ ఉప్పలపాటి సురేష్‌బాబులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీ కలయికతో మరింత ఉత్సాహం వచ్చిందన్నారు. రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనన్నారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల సుబ్బారావు, బొంతు పెదబాబు, దొమ్మేటి సాయికృష్ణ, గుడాల ఫణి, అరిగెల సూరిబాబు, దొమ్మేటి శ్యామ్, చిన్నం బాలవిజయరావు, రవణం రాము, సర్పంచ్ జల్లి బాలరాజు, పితాని కేశవరావు, కొర్లపాటి డీల్లి, పితాని రామకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మండపేట నియోజకవర్గంలో శనివారం జరిగే చంద్రబాబునాయుడు బహిరంగ సభకు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అనాతవరంలో కురసాల శివబాబు అధ్య క్షతన తెలుగుదేశం, జనసేన పార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు వ్యూహాత్మకంగా పనిచేయాలన్నారు. సమావేశంలో మిమ్మితి చిరంజీవి, పేరిచర్ల సురేష్‌రాజు, పెయ్యల వెంకటరమణ, శీలం వెంకటేశ్వరరావు, బొక్కా త్రిమూర్తులు, గంధం శ్రీను, మట్టపర్తి ఈశ్వరి, యిళ్ల శ్రీనివాసరావు, నిమ్మన్న వెంకటేశ్వర రావు, మునుకోటి ఏసుబాబునాయుడు పాల్గొన్నారు.

మలికిపురం: మండపేటలో జరిగే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయడానికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు నేతృత్వంతో గ్రామ గ్రామం నుంచి కార్యకర్తలు తరలివెళ్లడానికి వాహనాలను సమకూరుస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మహిళా నాయకులు మంగెన భూదేవి, బందెల పద్మల ఆధ్వర్యంలో కార్యకర్తలను కలుస్తూ గొల్లపల్లి ఇంటి నుంచి బయలుదేరడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మండలం నుంచి 150వాహనాల్లో తాటిపాక చేరి అక్కడి నుంచి ర్యాలీగా వెళతామని యుగంధర్ తెలిపారు.

మామిడికుదురు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొనే రా.. కదలిరా.. సభను విజయవంతం చేయాలని జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు పిలుపునిచ్చారు. పాశర్లపూడిలో మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన టీడీపీ, జనసేన నాయకుల సమావేశంలో నామన మాట్లాడారు. మండపేటలో శనివారం జరిగే సభకు గ్రామగ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోనం బాబు, మద్దాల కృష్ణమూర్తి, సూదా బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, సుందరనీడి చిన్ని, మల్లాడి విష్ణు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు అడబాల తాతకాపు, జాలెం శ్రీనివాసరాజా, కొమ్ముల జంగమయ్య కడలి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: మండపేటలో శనివారం జరిగే రా.. కదలిరా.. బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కోరారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి సభను విజయవంతం చేయడానికి సఖినేటిపల్లిలో పర్యటించారు. చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న రా.. కదలిరా.. బహిరంగ సభకు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. శనివారం ఉదయం 12 గంటలకు రాజోలు మండలం తాటిపాకలోని తన నివాసం వద్దకు చేరుకుని 12.30గంటలకు ర్యాలీగా మండపేట వెళ్తామన్నారు. ఎంపీటీసీ రుద్రరాజు వెంకట్రాజు, కొల్లాబత్తుల కుమార్, మంతెన సుబ్బరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ వచ్చే వరకే మీ ప్రభుత్వం: ఎమ్మెల్సీ ఐవీ


అంగన్‌వాడీల శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురం టౌన్, జనవరి 19: సార్వత్రిక ఎన్నికలకు విడదలయ్యే నోటిఫికేషన్ వచ్చే వరకే వైసీపీ ప్రభుత్వం ఉంటుందన్న విషయాన్ని జగన్ గుర్తించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో కోర్టు తీర్పులను అమలు చేయట్లేదని, రాష్ట్ర, దేశ అత్యున్నత న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను సైతం లెక్కచేయట్లేదని ఆయన ధ్వజమెత్తారు. ఆటువంటి ప్రభుత్వం దుర్మార్గంగా విడుదల చేసిన ఎస్మా చట్టాన్ని అంగన్‌వాడీలు ఎందుకు అమలు చేయాలని ఆయన ప్రశ్నించారు. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరం శుక్రవారం 39వరోజుకు చేరుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన ఐవీ తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఏమీ చేయకుండా సమ్మె ఎలా విరమిస్తారని ప్రశ్నించారు. సమ్మె శిబిరంలో జిల్లా అధ్యక్షురాలు కె.కృష్ణవేణి, కోశాధికారి పి.అమూల్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, గుదే దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ సంఘ నాయకులు కె.బేబీగంగారత్నం, ఎం.విజయలక్ష్మి, రత్నకుమారి, ఎ.సీత, జి.దైవకృప, పార్వతి, పరిపూర్ణ, మణిమాల, సుశీల, ఎస్‌కే రయా, పి.భవానీ తదితరులు పాల్గొన్నారు. తొలుత దీక్షా శిబిరం వద్ద కోటి సంతకాల సేకరణ ప్రక్రియను ఐవీ ప్రారంభించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చని జగన్

మామిడికుదురు, జనవరి 19: అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తమను ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారని అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు 39వ రోజు దీక్షా శిబిరం వద్ద అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటుచేసి నిరసన తెలిపారు. సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వానికి, జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకుని డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.అన్నపూర్ణ, జి.సూర్యకాంతం, కె.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

రామచంద్రపురం, జనవరి 19: డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించే వరకూ పోరాటం ఆగదని అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం 300మంది అంగన్వాడీలు 39వ రోజు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా మెయిన్‌రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకూ వెళ్లి నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్వాడీ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

39వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ముమ్మిడివరం: డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ముమ్మిడివరం సీడీపీవో కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. 125అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం జగన్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మాత్రం అమలుచేయడంలేదని, సామాజిక న్యాయం పాటించడం లేదని వారు నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ శిబిరంలో మాట్లాడుతూ అంగన్‌వాడీలు 39రోజుల నుంచి సమ్మె చేస్తుంటే స్పందించకపోవడం దారుణమన్నారు. శిబిరంలో ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, వి.తలుపులమ్మ, ధనలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, రత్న కుమారి, సత్యవతి, భవానీ, అరుణకుమారి, రమాదేవి పాల్గొన్నారు.

'జగన్, పవన్, బాబులను నమ్మవద్దు'

మండపేట, జనవరి 19: రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలను నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. పవన్, బాబు, జగన్‌తో పాటు కేంద్రంలో బీజేపీకి ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈనెల22న విజయవాడకు షర్మిల వస్తున్నారని, ఆమె పీసీసీ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఆమె ప్రమాణ స్వీకారానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు విజయవాడకు బయలు దేరి వెళ్తున్నామని కామన చెప్పారు. కాంగ్రెస్ నేతలు మగ్గం జాకబ్, పాడిశెట్టి సత్యనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల విడుదల కోసం యూటీఎఫ్ పోరుబాట


అమలాపురంలో యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిరసన

అమలాపురం టౌన్, జనవరి 19: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండు చేస్తూ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. గడిచిన ఐదేళ్లుగా పీఆర్సీ, డీఏలు, సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ బకాయిలు రూ.18,096 కోట్లు ప్రభుత్వం బాకీ పడిందని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ములను కూడా విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. అమలాపురంలోని యూటీఎఫ్ హోం వద్ద నుంచి మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్లో నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని రాత్రివేళ ధర్నా నిర్వహించారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పీఆర్సీ బకాయిల విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని, 12వ పీఆర్సీ అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ధర్నాలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా కార్యదర్శులు మురుగేశ్వరరావు, చంద్రకళ, పెన్నాడ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లిస్తే సంఘాలు నష్టపోతాయి

అమలాపురం టౌన్, జనవరి 19: ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందికి సహకార సంఘాల నుంచి జీతాలు చెల్లించాలని ఆదేశాలు అందడంపై సహకార సంఘాల ఉద్యోగులు, పాలకవర్గాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘాలకు ఏవిధమైన సంబంధం లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని నియమించారన్నారు. ఆయా కేంద్రాల్లో ఎంతమంది సిబ్బంది పనిచేశారో, ఎంత ధాన్యం కొనుగోలు చేశారో తమకు తెలియదని శుక్రవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ నియమించిన సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు చెల్లించేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు సంఘ ప్రతినిధి కొమ్మూరి సత్తిబాబు తెలిపారు.

రైతులకు రాయితీలు ఏవీ

అమలాపురం టౌన్, జనవరి 19: రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రాయితీలే కొరవడ్డాయని కోనసీమ రైతు పరిరక్షణ సమితి ముఖ్య సలహాదారు బోనం నాగేశ్వరరావు పేర్కొన్నారు. విభజన రాష్ట్రంలో ఎంతో ముందుచూపుతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్వపు ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చారని కలెక్టరేట్ వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు. కొడవలి నుంచి హార్వెస్టర్ వరకు రైతులకు 50శాతం రాయితీపై ఎన్నో యాంత్రీకరణ పరికరాలను రైతులకు అందజేసిన ఘనత చంద్రబాబు దేనన్నారు. నేడు ఎటువంటి ప్రణాళికలు లేకుండా సాగులో జాప్యం జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత సాధించిన చరణ్



అమలాపురం రూరల్, జనవరి 19: అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంపిక కోసం దేశంలోని యూనివర్శిటీలకు సంబంధించి నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షల్లో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ ఆచంట సత్యనాయణ కుమారుడు చరణ్ అర్హత సాధించాడు. ప్రస్తుతం పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీలో ఇన్ఫర్మేషన్ సైన్స్ పోస్టుగ్రాడ్యుయేషన్ చేస్తున్న చరణ్ కోర్సు పూర్తికాకముందే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత సాధించడం విశేషం. చరణ్‌ను బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణసతీష్ తదితరులు అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	సలార్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1.06లక్షల విరాళాలు

ఆత్రేయపురం, జనవరి 19: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ఏలూరు జిల్లా బయ్యన్నగూడేనికి చెందిన ఎస్.వెంకట్రాజు-సత్యవతి దంపతులు రూ.60,116, విశాఖపట్నానికి చెందిన టి.శేషుకుమార్-శ్రీలక్ష్మి దంపతులు రూ.25వేలు, ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన యు.సూర్యప్రకాష్ రూ.21,720 విరాళాలు సమర్పించారు. శుక్రవారం వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,78,502 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

సహకార యూనియన్ డైరీ ఆవిష్కరణ

కాట్రేనికోన, జనవరి19: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ) 2024వ సంవత్సరం డైరీని డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, కోశాధికారి పెంకే సత్యనారాయణ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కుంపట్ల అయ్యప్పనాయుడు, మట్టపర్తి జయరామ్, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కొడవలి వీరవెంకట సత్యనారాయణ, సుధాకర్‌వర్మ, ఎస్.నరసరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం, జనవరి 19: రామచంద్రపురం పట్టణ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వై.విజయనంద్ తెలిపారు. బ్రాడీపేట, స్టేట్‌బ్యాంక్, రామకృష్ణసెంటర్, మాతంగి హోటల్, రత్నంపేట, ముచ్చిమిల్లి, మునలమ్మ గుడి అఫీషియల్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, కమ్మవారి సావరం, వీఎస్ఎం కళాశాల, పసలపాడు చైతన్య ఆర్డీవో ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు.

'మాది తెలుగుదేశం కుటుంబం'

అమలాపురం టౌన్, జనవరి 19: టీడీపీ ఆవిర్భావం నుంచీ పార్టీలోనే కొనసాగుతున్నామని మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి పేర్కొన్నారు. పార్టీ ఏబాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. పార్టీలో గ్రూపులకు తాము వ్యతిరేకమని, మాది తెలుగుదేశం పార్టీ గ్రూపు అని స్పష్టం చేశారు. ఒక దశలో జగదీశ్వరి ఉద్వేగానికి లోనయ్యారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసేందుకు కొత్తకొత్త వాళ్ల పేర్లు వినిపిస్తున్నాయన్నారు. దశాబ్దాల కాలంగా పార్టీనే నమ్ముకుని ఉన్న మా కష్టాన్ని కూడా గుర్తించాలని కోరారు. నాయకులు చిల్లా పురుషోత్తం, పరమట శరత్‌బాబు పాల్గొన్నారు.

ప్రమాద పరిహారంపై అవగాహన సదస్సు

యానాం, జనవరి 19: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదానికి గురైన బాధితులకు సకాలంలో పరిహారం పొందే విధంగా మోటార్ వెహికల్ చట్టం 2021లో తీసుకొచ్చిన మార్పులు, చేర్పులపై శుక్రవారం యానాం సబ్‌మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మేజిస్ట్రేట్ రాజమోహన్ ఆధ్వర్యంలో అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టంలో పొందుపరిచిన అంశాలను ప్రభుత్వన్యాయవాది సలాది శ్రీనివాస్ వివరించారు. ఈచట్టం వల్ల బాధితులు పరిహారాన్ని సకాలంలో పొందాటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యాయవాదులు కమిడి విజయ్‌కుమార్, కనకాల రామదాసు, స్వరాజ్యలక్ష్మీ, భువనేశ్వరి, భ్రమరాంబికా, ట్రాఫిక్ ఎస్ఐ పూవ్వల వీరభద్రస్వామి, శేరు నూకరాజు, ప్రభుత్వాసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ద్రాక్షారామ, జనవరి 19: ఈనెల16వ తేదీ రాత్రి నున్న రాంబాబు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ఇంటిపై రాళ్లు రువ్వినట్లు కాపవరానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. దీనిపై గురువారం ఎస్ఐ సురేంద్ర కేసు నమోదు చేశారు.

కుమారుడి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

ముమ్మిడివరం, జనవరి 19: తన కుమారుడు కనిపించడంలేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గేదెల్లంకకు చెందిన లొల్ల వీరవెంకటభావనరుషి గత ఏడాది అక్టోబరు నుంచి కనిపించడం లేదని అతని తండ్రి కృపావరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు, హెచ్‌సీ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యా పరంగా జిల్లాను ముందంజలో ఉంచాలి

ముమ్మిడివరం, జనవరి 19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలను పటిష్టంగా, సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యాపరంగా జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాకారిణి ఎం.కమలకుమారి సూచించారు. ముమ్మిడివరం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో బొజ్జా రమణశ్రీ అధ్యక్షతన శుక్రవారం సీఆర్ఎంటీలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా డిజిటల్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థుల అభ్యాసన స్థాయిని పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి అనుగుణంగా సీఆర్ఎంటీలు పని చేయాలన్నారు. సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, ఐఈఆర్టీ ఎంవీవీ సత్యనారాయణలు యాప్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా నాడు-నేడు, జగనన్న గోరుముద్ద వంటి అనేక యాప్‌లను ఉపయోగించడానికి సీఆర్ఎంటీలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సీఆర్ఎంటీలు శిక్షణ వినియోగించుకుని ఉపాధ్యాయులకు ఏర్పడే సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.

వచ్చే ఎన్నికల్లో మాదిగలకు అవకాశం కల్పించాలి

మామిడికుదురు, జనవరి 19: రాబోయే ఎన్నికల్లో జిల్లాలో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి ఒక సీటు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్‌మాదిగ ఒక ప్రకటన ద్వారా కోరారు. వచ్చే ఎన్నికల్లో సీటు కేటాయిస్తే తమ ఆత్మాభిమానం చూపెడతామన్నారు. లేనిచో మందకృష్ణమాదిగ నాయకత్వంలో రాబోయే ఎన్నికలే లక్ష్యంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి తమ సత్తా చూపించడానికి మాదిగ జాతి యావత్ సిద్ధంగా ఉందని తెలిపారు.

జొన్నాడలో వేమన జయంతి వేడుకలు

ఆలమూరు, జనవరి 19: జొన్నాడలో వేమన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి నిర్వహించారు.ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. వేమనరెడ్డి సంఘం నాయకులు తాడి అమ్మిరెడ్డి, మేడపాటి రామారెడ్డి, తాడి శ్రీనివాస్‌రెడ్డి, ద్వారంపూడి అప్పారెడ్డి, ద్వారంపూడి దొరబాబు, తాడి ఆదిత్యారెడ్డి, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, తాడి నాగమోహన్‌రెడ్డి, తాడి రామచంద్రారెడ్డి, తాడి ఈశ్వరరెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, సర్పంచ్ కట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం, జనవరి 19: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో దుర్గారావు పేర్కొన్నారు. ఠాణేలంకలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. శిబిరంలో 353మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శేరిలంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎ.మణి, షిఫ్ట్ వైద్యులు కె.సింధుజ, ఎం.విజయ్‌కుమార్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో జె.రాంబాబు, సర్పంచ్ నక్కా విజయరాణి, ఎంపీటీసీ బొంతు శ్రీనివాసరావు, నాయకులు జగతా బాబ్జి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

రావులపాలెం, జనవరి 19:ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీవైఈవో ఎస్ఎస్‌వీ సత్యనారాయణరెడ్డి కోరారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రీఫైనల్ పరీక్షల తీరును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ప్రవేశపెట్టిన జయీభవ 50రోజుల ప్రోగ్రాంలో భాగంగా ప్రతి అధ్యాపకుడూ కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకుని ఉత్తమఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహావిష్కరణ

అమలాపురం టౌన్, జనవరి 19: జనసేన పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు పిండి సాయిబాబా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వెత్సావారి అగ్రహారంలో ఆయన విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రుద్రరాజు నానిరాజు, యేడిద శ్రీను, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, పిండి అమరావతి, తిక్కా సత్యలక్ష్మి, పిండి రాజా, కొప్పుల నాగమానస తదితరులు పాల్గొన్నారు.

22న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి

అల్లవరం, జనవరి 19: అయోధ్యలో ఈనెల22న విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ఆ రోజు రాష్ట్రంలోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు కోరారు.

కొత్తపేట: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగే ఈనెల22న రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం డిమాండ్ చేశారు.

గుమ్మిలేరు వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి

ఆలమూరు, జనవరి 19: గుమ్మిలేరులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. గ్రామానికి చెందిన రెడ్డి వెంకట్రావు ఆధ్వర్యంలో నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయంలో ఆయన భార్య లక్ష్మీకాంతం పర్యవేక్షణలో దీప, ధూప, నైవేద్యాలు జరుగుతున్నాయి. దాతల సహకారంతో అభివృద్ధి చేయాలన్న నిర్ణయంలో భాగంగా రూ.20లక్షల విరాళాలు సేకరించి సుందరంగా తయారు చేశారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ద్రాక్షారామ, జనవరి 19: వేగాయమ్మపేట, ఏరుపల్లి గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర శుక్రవారం జరిగింది. గ్రామసభలకు సర్పంచ్‌లు అంబటి తుకారం, మల్లిమొగ్గల శ్రీధర్‌లు అధ్యక్షత వహించగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ మాట్లాడారు. పీఎం గరీబ్ కల్యాణ్ అన్నయోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో పీవీపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొలుసు అపహరణ

ద్రాక్షారామ, జనవరి 19: వేగాయమ్మపేటలో వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గురువారం వాసంశెట్టి వీరయమ్మ 2కాసుల బంగారు గొలుసును ద్రాక్షారామ బ్యాంకులో కుదువ పెట్టేందుకు మెడలో వేసుకుని బస్సు కోసం బస్సు స్టాపులో నిలుచుంది. ఇంతలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని గొలుసును లాక్కుని పరారయ్యారు. ఎస్ఐ సురేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

అల్లవరం, జనవరి 19: సామంతకుర్రుకి చెందిన కర్రి వెంకటేశ్వరరావు(45) ఆర్థికఇబ్బందులు, ఇంటి సమస్యల నేపథ్యంలో పురుగుల మందు తాగిఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తల్లి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు

ముమ్మిడివరం, జనవరి 19: తన తల్లి ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైందని కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్నంపల్లికి చెందిన అయినవిల్లి దేవి తల్లి లంక సాయమ్మ ఈనెల17వ తేదీ ఉదయం నుంచి కనిపించడంలేదని, గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లిపోయిన సాయమ్మ మళ్లీ తిరిగి వచ్చిందని, ఆమె ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేదని, ఫిట్స్ వస్తుంటాయన్నారు. హెచ్‌సీ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.